## క్లుప్తంగా

### ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు

**వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి**

**మంగళగిరి టౌన్:** పోలీసులు, టీడీపీ నేతలు కలసి పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మంగళగిరి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికలు ముఖ్యమంత్రి కార్యాలయ డైరెక్షన్‌లో జరుగుతున్నాయని, అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు, రిగ్గింగ్‌లతో గెలవాలని టీడీపీ యత్నిస్తోందని ఆరోపించారు. ఓటు హక్కును వినియోగించుకునేలా అవకాశం ఇవ్వాలని, ఓటర్లు పోలీసుల కాళ్లు పట్టుకుని ప్రాధేయపడాల్సి వస్తోందన్నారు. ఓటరు స్లిప్‌లను లాక్కుని బయట వ్యక్తులను తీసుకువచ్చి దొంగ ఓట్లు వేయిస్తున్నారని ఇది చాలా ప్రమాదమని అన్నారు. చంద్రబాబు చర్యలతో వందేళ్ల వెనక్కు వెళ్లామని, చరిత్రలో ఇంత దారుణంగా ఎన్నికలు జరగలేదని, టీడీపీ, పోలీసులు, ఎన్నికల కమిషన్ కలిసిపోతే ఇక ఏం చేస్తామని ఆవేదన వ్యక్తం చేశారు.

### కేఎల్‌యూలో అంతర్జాతీయ యువజనోత్సవం



**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో వ్యాల్యూ ఎడ్యుకేషన్ సెల్, ఎఫ్ఈడీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజనోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సైకాలజిస్ట్ జి.శ్రీనాథ్ మాట్లాడుతూ యువశక్తి దేశ అభివృద్ధికి ఎంతో అవసరం అని, అలాంటి యువకులు చక్కని ప్రణాళిక వేసుకుని, లక్ష్యం కోసం ప్రయత్నించాలని తెలియజేశారు. సైకాలజిస్ట్ కిషోర్ మాట్లాడుతూ ప్రయత్నమే నిజమైన విజయమని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికా బద్ధంగా ప్రయత్నిస్తే విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ రాజశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సైకాలజిస్టులు విజయరత్నం, రాజేశ్వరి, భాను పాల్గొన్నారు.

### 15 నుంచి కృష్ణాష్టమి వేడుకలు



**మంగళగిరి:** ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజులపాటు తాడేపల్లి మండలం కొలనుకొండ వద్ద ఉన్న గోకుల క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు అక్షయపాత్ర ప్రతినిధి రఘునందన్‌దాస్ తెలిపారు. మండలంలోని ఆత్మకూరులోని అక్షయపాత్ర ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరినామ జపం, మహా అభిషేకం, నిర్వహించబడునని తెలిపారు. బాలగోపాలుడికి ఊయల సేవ సాంస్కృతిక కార్యక్రమాలు, నాట్య ప్రదర్శన, ఆటల పోటీలు నిర్వహించబడునని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించారు.

# పారిశుధ్యం అధ్వానం.. పందుల స్వైర విహారం

- నగరంలో జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- ఆస్పత్రులలో పెరుగుతున్న రోగులసంఖ్య

**మంగళగిరి :** పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండడంతో దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలు గత కొద్ది రోజులుగా విష జ్వరాలతో అల్లాడుతూ మంచం పడుతున్నారు. మంగళగిరి ప్రభుత్వాసుపత్రికి రోజుకు 130 నుంచి 150 మంది వివిధ రకాల రోగాలతో వస్తున్నారు. ఇక నగరంలోని 9 అర్బన్ హెల్త్ సెంటర్‌లకు రోజుకు దాదాపు 50 మంది రోగులు వస్తున్నారు. ఇక ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకునే వారు అధికం. నవులూరుకు చెందిన ఆరేళ్ల బాలుడు విష జ్వరంతో బాధపడుతూ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతుండగా వైద్య బృందం చికిత్స పొందుతున్న బాలుడి వివరాలు సేకరించింది.



మురుగు కాలువలో పందులు

#### రోగుల రాక పెరిగింది



గత కొద్ది రోజులుగా రోగుల రాక పెరిగింది. గతంలో 25 మంది వరకు వచ్చేవారు. ప్రస్తుతం 40 మంది కిపైగా రోగులు బీపీ, షుగర్, జ్వరాలతో వస్తుండగా వారిలో విష జ్వరాలతో బాధపడేవారు అధికంగా వస్తున్నారు.

– డాక్టర్ వసుంధర, యూపీహెచ్‌సీ, యర్రబాలెం

### ‘ఓటు చోరీ’ పై నిరసన



**మంగళగిరి టౌన్:** దేశ వ్యాప్తంగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపిస్తూ మంగళగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గౌతమబుద్ధ రోడ్‌లోని అంబేద్కర్ బొమ్మ వద్ద రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కంతేటి జీవన్‌సాగర్ మాట్లాడుతూ దేశంలో మోదీ సర్కార్ ఓటు బ్యాంక్ చోరీకి పాల్పడి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ రాజీనామా చేయాలన్నారు. పట్టణ మహిళా ప్రెసిడెంట్ కూర్మాల రాధిక, జిల్లా మహిళా అధ్యక్షురాలు శారద, జిల్లా ఓబీసీ చైర్మన్ పున్నారావు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ వీరప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం

- యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అనూష
- అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

**మంగళగిరి టౌన్:** నులిపురుగుల నివారణతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అనూష తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని వీవర్స్ కాలనీ నగరపాలక సంస్థ హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ నులిపురుగులతో పిల్లల్లో ఎదుగుదల ఉండదని అన్నారు. పిల్లల్లో నులిపురుగులు పెరగడానికి అపరిశుభ్రతే కారణమని, పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ముఖ్యంగా చేతిగోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నులిపురుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారి తీస్తాయని, దీనివల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మంగళగిరి ఎంఈవో బాబు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు, టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఫిరంగిపురంలో...**

**ఫిరంగిపురం:** మండలంలోని మునగపాడు ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఆరోగ్య సిబ్బంది మింగించారు. కడుపులో నులిపురుగుల ఉన్నట్లయితే పోషకాహారం లోపం, రక్తహీనత ఏర్పడతాయని ఆరోగ్య సిబ్బంది చెప్పారు. ఆల్బెండజోల్ మాత్రలు మింగడం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లింగరాజు, ఏఎన్ఎం అరుణ, అంగన్‌వాడీ ఆరోగ్యమేరి, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ అనూష

**తాడేపల్లిరూరల్‌లో...**

**తాడేపల్లిరూరల్:** జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్ ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ జయరాజు, అంగన్‌వాడీ టీచర్ యేసుమణిలు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య విద్యను బోధించామని తెలిపారు. ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. పాఠశాలకు హాజరు కాని విద్యార్థులకు 20వ తేదీన నులిపురుగుల నివారణ మాత్రలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగరాజు కుమారి, అంగన్‌వాడీ టీచర్లు కన్యాకుమారి, మరియకుమారి పాల్గొన్నారు.

**దుగ్గిరాలలో...**

**దుగ్గిరాల:** నులిపురుగుల నివారణ మాత్రల ద్వారా పిల్లల్లో రక్తహీనత రాకుండా కాపాడుకోవచ్చునని డాక్టర్ సి.ఇందిర అన్నారు. మంగళవారం దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో కె.లక్ష్మీనారాయణ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. అనంతరం డాక్టర్ సి.ఇందిర మాట్లాడుతూ 19 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం ద్వారా ఆరోగ్యంగా, రక్తహీనత లేకుంగా చురుకుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వి.సుబ్బారావు, బుజ్జి, లీల, విమల, స్వరూపరాణి, పాఠశాల హెచ్ఎం ఎం.జయరత్న రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులచే మాత్రలు మింగిస్తున్న ఆరోగ్య సిబ్బంది



చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



జెడ్పీ హైస్కూల్‌లో ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న డాక్టర్ ఇందిర, ఎంఈవో లక్ష్మీనారాయణ

■ ఈమని ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు డాక్టర్ శ్రీవల్లి ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. 3,666 మంది లక్ష్యం కాగా 3,629 మంది విద్యార్థులకు అందించినట్లు ఆమె తెలిపారు. మిగిలిన విద్యార్థులకు 20న అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

**మంగళగిరి టౌన్:** మంగళగిరి నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పాత మంగళగిరిలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ఏపీఎస్‌పీ క్యాంప్ రోడ్డు వద్ద ఉన్న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం మీదుగా గౌతమ బుద్ధ రోడ్, మిద్దె సెంటర్, తెనాలి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుంటూరు జిల్లా కార్యదర్శి పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, రాష్ట్ర, జిల్లా నాయకులు జగ్గారపు శ్రీనివాసరావు, తులిమిల్లి శ్రీనివాసరావు, నాయకులు మునగపాటి వెంకటేశ్వరరావు, భాను కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ పటేల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

# వైద్య శిబిరానికి విశేష స్పందన



**తాడికొండ:** మంగళవారం తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో న్యూరాలజీ సంబంధిత రోగుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో నరాలు, మెదడుకు సంబంధించిన వ్యాధులతో వచ్చిన 47 మందికి వైద్య సేవలు అందించారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయగా ఇందులో ముగ్గురిని ఎంఆర్ఐ, ఇతర పరీక్షలు, మెరుగైన వైద్యం కొరకు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకే ప్రతి వారం తాడికొండలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పొన్నెకల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భార్గవ్ పలువురు ఇంటర్న్‌షిప్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నాల్గవసారి చోరీకి గురైన విద్యుత్ వైర్లు

**తాడేపల్లిరూరల్ :** తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ల వద్ద మంగళవారం మరోసారి విద్యుత్ వైర్ల చోరీకి పాల్పడ్డారు. కొత్తూరు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద నుంచి తాడేపల్లి ప్రాతూరు, కొత్తూరు, ముగ్గురోడ్డు, సాయిబాబా గుడి తదితర ప్రాంతాలకు తాగునీటిని విద్యుత్ మోటార్ల ద్వారా నేరుగా అందజేస్తారు. ఈ విద్యుత్ మోటార్ల వద్ద వైర్లు నాల్గవసారి చోరీకి గురికావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విద్యుత్ మోటారు వైర్లు చోరీకి గురికావడంతో ఉదయం తాగునీటి సరఫరాను అధికారులు నిలిపివేశారు. కొత్త వైర్లను పునరద్ధరించి తాగునీటిని ప్రజలకు అందించినట్లు అధికారులు తెలిపారు.



### నేడు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి శంకుస్థాపన


**తాడికొండ:** రాజధాని ప్రాంతం తుళ్లూరు గ్రామ సమీపంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభోత్సవం జరగనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హిందూపురం ఎమ్మెల్యే, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ నందమూరి బాలకృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు భూమి పూజ నిర్వహించిన అనంతరం తుళ్లూరులో నూతనంగా నిర్మించిన ఎన్‌టీఆర్ విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొననున్నారు.

### నమ్మిన వారిని మోసం చేసిన కూటమి ప్రభుత్వం



**ఫిరంగిపురం:** ఎన్నికల్లో గెలిపించి పట్టం కట్టిన వారిని ఇచ్చిన హామీలు నెరవేర్చక కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలకతీతంగా బడుగుబలహీన వర్గాలు, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చలేదని, ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని చెప్పారు. అనంతరం క్యూఆర్ కోడ్ పత్రాలను ఆవిష్కరించారు. చిట్టా అంజిరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, శివకుమారి, వై.హేమలతారెడ్డి, మస్తాన్‌వలి, కె.ప్రవీణ్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, బాబురావు, గోపి, పి.శ్రీనివాసరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, పట్టాభి, కోటిరెడ్డి, శివారెడ్డి, అమానుల్లా, సాల్మన్, రాయప్ప, సయ్యద్ సైదులు, ఎ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


### ఘనంగా జాతీయ లైబ్రేరియన్స్ డే



**మేడికొండూరు:** గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని ఎన్నారై కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్‌బాబు అన్నారు. మండలంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన జాతీయ లైబ్రేరియన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రంథాలయాలు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ డి.సంజయ్ అధ్యక్షత వహించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ కోట శ్రీనివాస్, లైబ్రేరియన్ డాక్టర్ రసూల్ మాట్లాడారు. విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి, ఏవో సీతారామయ్య, వివిధ శాఖాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

### రాజకీయ పార్టీలను విద్యార్థి సంఘాలతో పోల్చడం సరికాదు

**ఏపీఎస్ జేఏసీ నాయకులు**



**మంగళగిరి టౌన్:** పాఠశాల విద్యాశాఖ, ఇంటర్ బోర్డు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే వెనక్కు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు హేమాద్రి యాదవ్, ముఖ్తార్ బాషాలు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరు బైపాస్‌రోడ్డు వద్ద ఉన్న విద్యాభవన్ ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పాఠశాల, జూనియర్ కళాశాలల ఆవరణలోకి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల మినహా ఏ ఇతర రాజకీయ పార్టీలు, సంస్థలు, సంఘాలకు అనుమతిని నిరాకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలంటూ ఏపీఎస్ జేఏసీ నాయకులు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ పి.పార్వతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలను విద్యార్థి సంఘాలతో పోల్చడం సరికాదన్నారు. ఓబీసీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయలసీమ జిల్లా అధ్యక్షుడు ఉత్తన్న, నాయకులు పాల్గొన్నారు.